క్లుప్తంగా

అక్టోబరు 4న ధర్నా

బాడంగి: తమ న్యాయమైన డిమండ్ల పరిష్కారమే లక్ష్యంగా అక్టోబరు 4వ తేదీన గ్రామీణ డాక్ సేవక్(గ్రామీణ తపాలా ఉద్యోగి)లు ధర్నా చేపడుతున్నట్లు ఏఐజీడీఎస్‌యూ ప్రత్యేక ఆహ్వానితురాలు ఆర్.హేమలత తెలిపారు. ఆదివారం స్థానిక పట్టణంలోని బ్రాంచి పోస్టాఫీస్ వద్ద ఆమె విలేకరులతో మాట్లాడుతూ గ్రామీణ డాక్ సేవక్‌లను రెగ్యులర్ చేస్తూ వారి పనివేళలు 8 గంటలు చేయాలని, సీనియర్ జీడీఎస్‌లకు 12, 24, 36 ఏళ్ల సర్వీసుల ఆధారంగా అదనపు ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని, అలాగే రూ.5 లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ ఇవ్వాలని, వైద్య సదుపాయాలు అందజేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయా సమస్యల పరిష్కారానికి నాలుగంచెల పోరాటానికి ఉద్యోగులు సిద్ధమయ్యారని, ఇప్పటికే రెండు పోరాటాలు పూర్తయ్యాయని, ప్రస్తుతం చేయబోయేది మూడో పోరాటమన్నారు. నాలుగు పోరాటాలు ముగిసేలోపు కేంద్రం నుంచి స్పందన రాకపోతే డిసెంబరులో ఇన్‌డెఫినిట్ సమ్మె చేపడతారన్నారు.

నేత్ర వైద్య శిబిరం


వృద్ధుడి కంటిని పరీక్షిస్తున్న ఆప్తాలమిక్ అధికారి సురేష్

రాజాం: స్థానిక పట్టణంలోని కంచరవీధి సత్యసాయి మందిరంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. విశాఖ శంకర్ ఫౌండేషన్ ఆప్తాలమిక్ అధికారి సురేష్ శిబిరానికి వచ్చిన వారికి నేత్రవైద్య పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. నేత్ర శస్త్రచికిత్స అవసరమైన వారికి ఆస్పత్రికి పంపించారు. కార్యక్రమంలో మందిర కన్వీనర్ బసవరాజు, సత్యసాయి జోనల్ కన్వీనర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

'చదవడం మాకిష్టం'

బాడంగి: స్థానిక శాఖా గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ ఆర్.దుర్గాప్రసాద్ గ్రంథాలయానికి విచ్చేసిన విద్యార్థులకు వారికి ఇష్టమైన పుస్తకాలు అందజేసి, వారితో చదివించారు. అలాగే నీతికథలు, నీతి పద్యాలు తెలిపి, వాటిలోని నీతిని వివరించారు. అలాగే జాతీయ నాయకులు, గొప్ప గొప్ప వ్యక్తుల జీవిత చరిత్రలు చదివి తెలుసుకోవాలని వారికి తెలిపారు.

తాగునీటి కుళాయిల ప్రారంభం



తాగునీటి కుళాయిలు ప్రారంభిస్తున్న సర్పంచ్ సూర్యనారాయణ

మెంటాడ: మండలంలోని చింతలవలస గ్రామంలో కొత్తగా ఏర్పాటు చేసిన తాగునీటి కుళాయిలను సర్పంచ్ కలిశెట్టి సూర్యనారాయణ ఆదివారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇంటింటికీ తాగునీరు అందివ్వడమే ప్రభుత్వ లక్ష్యమని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతీ ఇంటికి కుళాయి ఇవ్వడం జరిగిందన్నారు. ప్రజలు కూడా ప్రభుత్వ సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

చురుగ్గా పారిశుద్ధ్య పనులు

రేగిడి: మండలంలోని చాటాయివలస, వన్నలి, అంబఖండి, పనసలవలస, ఉనుకూరు, చిన్నశిర్లాం, బూరాడ తదితర గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చాలా చురుగ్గా జరుగుతున్నాయి. ప్రధాన వీధులు, రోడ్లలో పేరుకుపోయిన చెత్తా చెదారం, కాలువల్లోని పూడికలు తొలగించారు. అనంతరం పరిసరాల పరిశుభ్రతపై సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు గ్రామస్తులకు అవగాహన కల్పించారు.

పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలి


విద్యార్థితో పుస్తకం చదివిస్తున్న లైబ్రేరియన్ కృష్ణమూర్తి

తెర్లాం: ప్రాథమిక స్థాయి నుంచే ప్రతీ విద్యార్థి పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలని, ఇది వారికి ఎంతో మేలు చేస్తుందని లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో చదవడం మాకిష్టం అనే కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. అనంతరం లైబ్రేరియన్ మాట్లాడుతూ పుస్తక పఠనం ద్వారా మంచి విజ్ఞానం కలుగుతుందని, పుస్తకాలు చదివితే ఎన్నో విషయాలు తెలుస్తాయన్నారు. పుస్తక పఠనంతో పాటు కథలు చెప్పడం, రాయడం నేర్చుకోవాలన్నారు. అలాగే చిత్రలేఖనంపై ప్రతీ విద్యార్థి దృష్టి సారించాలన్నారు.

సద్గుణాలు అలవర్చుకోవాలి

రేగిడి: ప్రతిఒక్కరూ సద్గుణాలు అలవర్చుకోవాలని పాలకొండకు చెందిన ఆధ్యాత్మిక వక్త ఎన్‌వీ రమణ అన్నారు. ఆదివారం మండలంలోని దేవుదళ గ్రామ గీతాశ్రమంలో జరిగిన సత్సంగ సమావేశానికి హాజరైన ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా తోటివారిని గౌరవించడం నేర్చుకోవాలని, ఇతరులతో స్నేహభావంతో మెలగాలన్నారు.


రామభద్రపురం పూడి వీధిలో గణేశునికి పూజలు చేస్తున్న ఎంపీపీ లక్ష్మణరావు తదితరులు


బొబ్బిలి: అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నేతలు


బొబ్బిలి: యాగం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నేత వేణుగోపాలనాయుడు

ఆధ్యాత్మిక సందడి

గణేశుని నవరాత్రి ఉత్సవాలతో అంతటా ఆధ్యాత్మిక సందడి నెలకొంది. ఆదివారం ఉదయం భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానాలు, సాయంత్రం సాంస్కృతిక ప్రదర్శలు చేపట్టారు. వీటితో పాటు కొన్నిచోట్ల నిమజ్జనోత్సవాలు ఎంతో అట్టహాసంగా జరిగాయి. గణనాథుని విగ్రహ ఊరేగింపులో డీజే పాటలకు యువతీ,యువకులు చేసిన నృత్యాలు చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి.
–సాక్షి నెట్‌వర్క్


వంగర: రుషింగిలో అన్నసమారాధనలో భక్తులు


రాజాం సిటీ: వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో సామూహిక కుంకుమార్చనల్లో పాల్గొన్న మహిళలు


రేగిడి: అంబకండిలో వినాయకుని మండపం వద్ద మహిళల పూజలు


రాజాం: పెనుబాకలో ఆకట్టుకున్న అమ్మవార్ల వేషధారణలు


రాజాం: లచ్చయ్యపేటలో జరిగిన భారీ అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నేతలు

సర్పంచ్ సొంత నిధులతో కాలువ నిర్మాణం

తెర్లాం: మండలంలోని కూనాయవలస గ్రామంలోని బీసీ కాలనీలో ఎన్నో ఏళ్లగా ఉన్న వీధి కాలువ సమస్య ఎట్టకేలకు తీరనుంది. ఆ గ్రామ సర్పంచ్, మండల సర్పంచ్‌ల సంఘం ప్రధాన కార్యదర్శి బోడెల విజయబాబు తన సొంత నిధులతో కాలువ నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నారు. కాలువ లేకపోవడంతో వర్షం వస్తే చాలు నీరంతా వీధిలో నిల్వ ఉండిపోయేది. దీంతో ఆ కాలనీ వాసులు నానా ఇబ్బందులు పడేవారు. ఈ సమస్యను సర్పంచ్ దృష్టికి ఆ వీధి ప్రజలు తీసుకురావడంతో వెంటనే స్పందించిన ఆయన తన సొంత డబ్బులతో జేసీబీ పెట్టి, కాలువ తీయించారు. కాలువ నిర్మాణాన్ని పూర్తి స్థాయిలో చేపట్టి, వర్షపు నీరు నిల్వ లేకుండా చూస్తానని సర్పంచ్ హామీ ఇవ్వడంతో ఆ కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు. సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.


కాలువ నిర్మాణానికి జేసీబీతో తవ్వకాలు చేయిస్తున్న సర్పంచ్ విజయబాబు

ఉక్కు పరిశ్రమను అమ్మితే బీజేపీ అంతు చూస్తాం..

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కె.లోకనాథం

బొబ్బిలి: విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటు వ్యక్తులకు అమ్మితే బీజేపీ అంతు చూస్తామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కె.లోకనాథం హెచ్చరించారు. విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ సీపీఎం చేపట్టిన ఉక్కు పరిరక్షణ యాత్ర ఆదివారం రాత్రి బొబ్బిలికి చేరుకుంది. అనంతరం తాండ్రపాపారాయ సెంటర్‌లో జరిగిన ఆ పార్టీ బహిరంగ సభలో ఆయన కేంద్ర ప్రభుత్వ పాలనను విమర్శించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్(ఉక్కు పరిశ్రమ) స్థాపనకు జరిగిన 32 మంది బలిదానాల సంగతి కేంద్రానికి తెలియదా అని ప్రశ్నించారు. ప్రధాని మోదీ గద్దెను ఎక్కిన నాటి నుంచి ప్రజావ్యతిరేక విధానాలనే అవలంబిస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో ప్రజలే వారికి తగిన బుద్ధి చెబుతారన్నారు. సభలో ఆ పార్టీ విశాఖపట్నం, పార్వతీపురం మన్యం జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు, విజయనగరం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ, సీపీఎం జిల్లా అధ్యక్షుడు పొట్నూరు లక్ష్మీనాయుడు, ఐద్వా నాయకురాలు వి.ఇందిర తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు లోకనాథం

మాదకద్రవ్యాలు విక్రయిస్తే కఠిన చర్యలు

- డీఎస్పీ శ్రీధర్

రామభద్రపురం: దాబాల్లో గంజాయి, కొకైన్, హెరాయిన్, ఖైనీ, గుట్కా వంటి మాదకద్రవ్యాలు విక్రయించవద్దని, మద్యం సేవించేందుకు అనుమతించినా సంబంధిత యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ శ్రీధర్ హెచ్చరించారు. ఆదివారం మండలంలోని దాబాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన దాబాలకు వచ్చే వారు మద్యం సేవించి, అసభ్యకరంగా ప్రవర్తించినా దాబాలు మూయించేస్తామన్నారు. ఇలాంటి ప్రదేశాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని, అనుమానిత వ్యక్తులు ఎవరైనా దాబాలకు వస్తే స్థానిక ఎస్‌ఐకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఆయన వెంట ఎస్‌ఐ సురేంద్రనాయుడు తదితరులు ఉన్నారు.


దాబాల్లో తనిఖీలు నిర్వహిస్తున్న డీఎస్పీ శ్రీధర్

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

బొబ్బిలి: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని గ్రీన్‌బెల్ట్ సొసైటీ అధ్యక్షుడు ఎస్వీ రమణమూర్తి అన్నారు. మండలంలోని గున్నతోటవలస గ్రామంలో గ్రీన్‌బెల్ట్ సొసైటీ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ తమవంతుగా మొక్కలు నాటి, వాటిని పరిరక్షించాలన్నారు. మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ, జీవ వైవిధ్యం సాధ్యమన్నారు. కార్యక్రమంలో గ్రీన్‌బెల్ట్ సొసైటీ కోశాధికారి వీఎస్ శర్మ, సర్పంచ్ ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


మొక్కలతో గ్రీన్‌బెల్ట్ సొసైటీ సభ్యులు, చిన్నారులు

ప్రకృతి సేద్యంతో అధిక దిగుబడులు

రామభద్రపురం: ప్రకృతి సేద్యంతో అధిక దిగుబడులు సాధించవచ్చని ప్రకృతి వ్యవసాయం యూనిట్ ఇన్‌చార్జ్ రమణ అన్నారు. ఆదివారం మండలంలోని మిర్తివలస గ్రామంలో జిల్లేడు ద్రావణం తయారీపై రైతులకు అవగాహన కల్పించిన ఆమె కషాయాలతో తయారు చేసిన ద్రావణం పిచికారీ చేయడం ద్వారా పంటలకు పట్టే చీడపీడలు, తెగుళ్లను నివారించవచ్చన్నారు. డీఏపీ, యూరియా వంటి ఎరువులతో పాటు పురుగుమందులు వాడకం కూడా తగ్గించి, ప్రకృతి వ్యవసాయంలో భాగంగా తయారు చేసిన కషాయాలు, ద్రావణాలు ఎక్కువగా వాడాలని కోరారు. ఇలా చేస్తే ఆరోగ్యవంతమైన పంటలు పండించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రాంబాబు, ఐసీఆర్‌పీ ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.


జిల్లేడు ద్రావణం తయారీని ప్రయోగాత్మకంగా వివరిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

ఫార్మసీ రంగంలో అపార అవకాశాలు

మెంటాడ(గజపతినగరం రూరల్): భవిష్యత్ అంతా ఫార్మసీ రంగానిదేనని, ఫార్మసీ కోర్సులు చేసిన వారికి అపారమైన ఉపాధి అవకాశాలున్నాయని ఆంధ్రా యూనివర్సిటీ ఫార్మసీ కళాశాల ప్రొఫెసర్ కె.ఈశ్వరప్రసాద్ అన్నారు. గజపతినగరం మండలంలోని సీతారామపురం గ్రామంలోని శ్రీసాయి ఫార్మసీ కళాశాల వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. అతిథిగా హాజరైన ప్రొఫెసర్ ఈశ్వరప్రసాద్ మాట్లాడుతూ ప్రస్తుతం అత్యంత వేగంగా ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న రంగం ఏదైనా ఉందంటే అది ఫార్మసీ రంగమేనని అన్నారు. వార్షికోత్సవంలో భాగంగా విద్యార్థులకు వివిధ ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

అగ్నిఅస్త్రం తయారీపై అవగాహన


అగ్నిఅస్త్రం తయారీని వివరిస్తున్న ప్రకృతి వ్యవసాయం పాగిరి యూనిట్ ఇన్‌చార్జ్ రమాదేవి

రాజాం: మండలంలోని పొగిరి గ్రామంలో అగ్ని అస్త్రం తయారీపై రైతులకు ఆదివారం అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయం పొగిరి యూనిట్ ఇన్‌చార్జ్ పి.రమాదేవి మాట్లాడుతూ వరి, మొక్కజొన్న పంటలను ఆశించే చీడపీడలు, తెగుళ్ల నివారణకు ప్రకృతి వ్యవసాయ విధానలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. అనంతరం 20 లీటర్ల అగ్ని అస్త్రంను రైతులతో తయారు చేయించి, కాండంతొలిచే పురుగు ఆశిస్తున్న పంటలో దానిని పిచికారీ చేయించారు. రసాయనిక ఎరువుల వినియోగం తగ్గించి, సేంద్రియ ఎరువులు వినియోగించాలని తెలిపారు. కార్యక్రమంలో ఐసీఆర్‌పీ నిర్మల, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్‌లు, రైతులు పాల్గొన్నారు.

రక్తదానం

నెల్లిమర్ల: సాధన యువజన సంఘ సభ్యులు ఆదివారం రక్తదానం చేశారు. విజయనగరం సర్వజన ఆస్పత్రి బ్లడ్‌బ్యాంక్‌లో సేవా పక్వాడా కార్యక్రమంలో భాగంగా మేము సైతం అంటూ జరజాపుపేటకు చెందిన సాధన యువజన సంఘం సభ్యులు రక్తదానం చేసి పలువురికి ఆదర్శంగా నిలిచారు. దేశ ప్రధాని పుట్టిన రోజు సందర్భంగా సామాజిక చైతన్యంతో సాధన యువజన సంఘ సభ్యులు రక్తదానం చేయడంపై పలువురు అభినందించారు. ఈ సందర్భంగా సాధన అధ్యక్షుడు పి. దుర్గాప్రసాద్ మాట్లాడుతూ, ప్రతిఒక్కరూ రక్తదానం వైపు మొగ్గు చూపాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పూర్ణ, రామకృష్ణ, కె. శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

బొబ్బిలి: రోడ్డు భద్రతా నియమాలు పాటించి, ప్రమాదాల నివారణకు తోడ్పడాలని ఎస్‌ఐ చదలవాడ సత్యనారాయణ అన్నారు. స్థానిక పట్టణంలోని ఆర్‌టీసీ కాంప్లెక్స్ వద్ద యంగ్‌మెన్స్ హ్యాపీ క్లబ్ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతా నియమాలపై ఆదివారం అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ రోడ్డుకు కుడివైపునే నడవాలని, జీబ్రాక్రాసింగ్ వద్దనే రోడ్డును దాటాలని పాదచారులకు తెలిపారు. వాహనదారులు ఎడమవైపున నడపాలని, వాహనాలను ఓవర్‌టేక్ చేసేటప్పుడు కుడివైపు నుంచి చేయాలని, ట్రాఫిక్ సిగ్నల్స్ పాటించాలని, రోడ్డు మలుపు చిహ్నాలు చూసి, వాహనాలు జాగ్రత్తగా నడపాలని తెలిపారు.

అలాగే ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారులో వెళ్లేవారు సీటుబెల్టు పెట్టుకోవాలని, పరిమితికి మించి ప్రయాణికులను వాహనాల్లో ఎక్కించవద్దని, అధిక లోడుతో వాహనాలు నడపవద్దన్నారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు మింది విజయమోహనరావు, తదితరులు పాల్గొన్నారు.

భావవాదం వదిలి భౌతికవాదం అనుసరించాలి

- పుస్తకావిష్కరణలో సాహితీవేత్త అట్టాడ అప్పలనాయుడు

రాజాం సిటీ: భావవాదాన్ని వదిలి భౌతికవాదం అనుసరించినప్పుడే సమాజం అభ్యుదయ పథంలో నడుస్తుందని సాహితీవేత్త అట్టాడ అప్పలనాయుడు అన్నారు. ఆదివారం స్థానిక విద్యానికేతన్ స్కూల్‌లో ఆదివారం జరిగిన రాజాం రచయితల వేదిక(రారవే) 104వ సమావేశానికి హాజరైన ఆయన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యా పరిరక్షణ కమిటీ కన్వీనర్ డి.రమేష్ పట్నాయక్ రాసిన 'గతి తార్కిక భౌతిక వాదము-పరిచయం', 'డేవిడ్ హార్వే-పెట్టుబడి, ఏడు ప్రాథమిక వైరుధ్యాలు-పరిచయం' అనే రెండు పుస్తకాలను ఆవిష్కరించారు. సమాజ చలనానికి, మారుతున్న కాలానికి, పరిస్థితులను అన్వయం చేస్తూ సిద్ధాంతాలను మార్చుకుంటూ ఉండాలన్నారు. సమాజంలో భూస్వామ్యవ్యవస్థ అంతరించిపోతోందని, రైతు, కూలీల మధ్య భేదం తరిగిపోతోందన్నారు. ఇలా మారుతున్న పరిస్థితుల దృష్ట్యా సామాజిక ఆర్థిక సూత్రాలను పునఃసమీక్ష చేసుకోవాలన్నారు. శ్రామిక వర్గాలు మార్క్స్ సూత్రాలను అవగాహన చేసుకున్నప్పుడే అభ్యుదయాన్ని సాధిస్తాయన్నారు. కార్యక్రమంలో రారావే నిర్వాహకులు గార రంగనాథం, రౌతు గణపతిరావునాయుడు, అంబళ్ల రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.


పుస్తకాలు ఆవిష్కరిస్తున్న సాహితీవేత్త అప్పలనాయుడు

ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలి

రేగిడి: రైతులు తాము పండిస్తున్న పంటలకు సంబంధించి, ఈ-క్రాప్ నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి జి.మురళీకృష్ణ సూచించారు. ఆదివారం మండలంలోని చాటాయవలస, వన్నలి, అక్కన్నఅగ్రహారం, ఉప్పరనాయుడువలస తదితర గ్రామాల్లో జరుగుతున్న ఈ-క్రాప్ నమోదును పరిశీలించిన ఆయన ఈ-క్రాప్ నమోదు చేయించుకుంటే రైతుల పంటను ప్రభుత్వం కొనుగోలు చేసేందుకు వీలుంటుందన్నారు. అలాగే పంట నష్టం కూడా వచ్చే అవకాశం ఉంటుందన్నారు.


చాటాయవలసలో ఈ-క్రాప్ నమోదు చేస్తున్న వ్యవసాయాధికారులు

నైతిక విలువలతో కూడిన విద్యనందించాలి

రాజాం సిటీ: మెరుగైన సమాజ నిర్మాణానికి ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులకు విలువలతో కూడిన విద్యనందించాలని పద్మశ్రీ అవార్డు గ్రహీత యడ్ల గోపాలరావు అన్నారు. ఆదివారం స్థానిక పట్టణంలో వికాస తరంగిణి ఆధ్వర్యంలో చేపట్టిన నియోజకవర్గ స్థాయి పద్య పఠన పోటీలను ఆయన ప్రారంభించి, విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు నీతిపద్యాలు కంఠస్థం చేసి, నేర్చుకోవడం, వాటిలోని నీతిని గ్రహించడం ద్వారా ఉత్తమ పౌరులుగా తయారు కావచ్చన్నారు. ఇదిలా ఉండగా, 3 నుంచి 7వ తరగతి వరకు జూనియర్ విభాగంలో నిర్వహించిన పోటీల్లో ప్రభుత్వ పాఠశాలల నుంచి లెంక పూజిత(ఎంపీపీఎస్, నక్కపేట) ప్రథమ, మక్క రోహిత్ (ఎంపీయూపీఎస్, పెంట) ద్వితీయ, ఎం. పద్మజ (ఎంపీయూపీఎస్, పెనుబాక) తృతీయ బహుమతులు గెలుచుకున్నారు. సీనియర్స్ విభాగంలో పాగిరి శ్రావణి(ఎంపీయూపీఎస్, పెంట) ప్రథమ, డోకి గౌరి(ఎంపీపీఎస్ అంతకాపల్లి) ద్వితీయ, రెడ్డి లహరి(జెడ్పీహెచ్ఎస్ డోలపేట) తృతీయ బహుమతులు పొందారు. అలాగే ప్రైవేటు పాఠశాలల నుంచి జూనియర్స్ విభాగంలో రౌతు గ్రీష్మ, పాడి సాయికీర్తన, బింగి సోనాలిక వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు కైవసం చేసుకున్నారు. సీనియర్స్ విభాగంలో టంకాల శృతి, టంకాల పూజిత, వారాడ గీతాశ్రీ తొలి మూడు స్థానాల్లో నిలిచి వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు పొందారని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో వికాస తరంగిణి సెంట్రల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ టీటీవీ రమణమూర్తి, గార పాటి శ్రీనివాసరావు, అమనాన నీలకంఠం తదితరులు పాల్గొన్నారు.


బహుమతులు, ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

ఆశాజనకంగా మొక్కజొన్న సాగు

రేగిడి: మండలంలోని రైతులు ఈ ఏడాది పండిస్తున్న మొక్కజొన్న సాగు కాస్త ఆశాజనకంగా కనిపిస్తోంది. అడపాదడపా కురిసిన వర్షాలు, మడ్డువలస ప్రాజెక్టు ద్వారా సరఫరా అయిన సాగునీరు వ్యవసాయానికి అనుకూలించాయి. మండలంలో మొత్తం 4,600 ఎకరాల్లో మొక్కజొన్న సాగు జరుగుతుండగా, ఎక్కడ చూసినా పంట ఏపుగా పెరిగి ఉండడంపై రైతన్నలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మండల వ్యవసాయాధికారి జి.మురళీకృష్ణ, ఆర్‌బీకే అగ్రి కల్చర్ అసిస్టెంట్లు ఎప్పటికప్పుడు రైతులకు సలహాలు, సూచనలు చేస్తూ సాగు బాగుండేలా చూస్తున్నారు. ప్రభుత్వం కూడా సాగుకు ఆర్థికసాయం, రుణాలు అందిస్తుండడంతో అన్నదాతలు సాఫీగా వ్యవసాయం చేయగలుగుతున్నారు.


అంబకండిలో సాగు చేస్తున్న మొక్కజొన్న